## 16

# మెట్లు

**మా** వదినగారి కొడుకు పెళ్ళికని భద్రాచలం బయల్దేరుతుంటే ముందుగా గుర్తొచ్చిన మనిషి మోహన. ఇరవై సంవత్సరాల తరువాత తిరిగి భద్రాచలం వెళ్తున్నానంటే నిజానికి జ్ఞాపకం రావల్సినవాడు వాల్మీకి. కానీ మోహన వల్లనే వాల్మీకి పట్ల నాకు ఆత్మీయత ఏర్పడింది. మోహనను చూచి రెండున్నర దశాబ్దాలు దాటింది. అయినా ఈనాటికీ పాలు త్రాగుతున్న లేగదూడను కడుపు నిండక ముందే దూరంగా లాగేస్తే దానివైపు జాలిగా చూసే గోమాత కళ్ళను చూస్తే మోహన గుర్తొస్తుంది. శ్రావణ మాసం సంధ్య వేళలో పేరంటాలకు వెళ్ళే ముత్తైదువుల మీద అక్షతల్లా కురిసిన వాన వెలిసిన తరువాత ఆకాశంలో దృశ్యాదృశ్యంగా తొంగిచూచే హరివిల్లు చూసినపుడు మోహన నవ్వు గుర్తొస్తుంది.

మోహన నా చిన్ననాటి నెచ్చెలి కాదు. మా అక్కయ్యకు క్లాస్‌మేట్. వయసులో మా అక్కయ్యకన్న పెద్దదిలాగా కనిపించేది. నేను ఆ సంవత్సరమే ఆరో క్లాసులో చేరాను. అక్కయ్య స్కూలు ఫైనలు కొచ్చింది. నాన్నగారు పత్తిపాడులో ఉద్యోగం చేసేవారు. ఆరోజుల్లో పత్తిపాడులో హైస్కూలు లేదు. అక్కయ్యనూ, నన్నూ కిర్లంపూడి హైస్కూల్లో చేర్చారు. తెలుగు మాష్టారిగారి అమ్మాయి మైత్రేయి అక్కయ్య క్లాసే. మేము మా కారియర్లు వాళ్ళింట్లో పెట్టి మధ్యాహ్నం అక్కడే భోజనాలు చేసేవాళ్ళం. భోజనాలయ్యాక స్కూల్లో చెట్ల క్రింద కూర్చుని కబుర్లు చెప్పుకునేవాళ్ళు వాళ్ళంతా. అక్కయ్య మాట నాకు వేదవాక్కు. తన కారియర్ నేనే మోసేదాన్ని. చెప్పినమాట వినేదాన్ని. లేకపోతే ఇంటర్ వెల్‌లో నాకు బఠాణీలూ, వేరు శనక్కాయలూ కొనిపెట్టనని బెదిరించేది. ఇంతకీ అవన్నీ కొనుక్కువచ్చే పనినాదే. అణా వేరు శనక్కాయలూ, అర్థణా బఠాణీలూ లంగాలో పోయించుకుని లంగా కొసలు కలిపి పట్టుకుని వంగి వంగి అవస్థ పడుతూ వచ్చే నన్నుచూచి అక్కయ్య స్నేహితులు నవ్వేవాళ్ళు. నాకు రోషమూ దుఃఖమూ ముంచుకొచ్చేది. వాళ్ళ గుంపుకు కాస్త దూరంగా మరో చెట్టు క్రింద కూర్చుని పుస్తకం చదువుకునే మోహన వీళ్ళ నవ్వులు విని తలెత్తి నాకేసి చూసేది. ఆ చూపులు ఎంతో ప్రేమగా నన్ను ఓదారుస్తున్నట్టుగా వుండేవి. సాధారణంగా

మోహన ఒంటరిగా కూర్చునేది. అక్కయ్యగానీ ఆమె స్నేహితురాళ్ళుగానీ మోహనతో కలిసే వారు కాదు. క్లాసులో కూడ మోహన ఆఖరి బెంచీమీద కూర్చునేది.

ఒకరోజు నేను మా క్లాస్‌వైపు నడుస్తుంటే వెనకనుండి పిలిచింది మోహన. ఒకవైపు ఉత్సాహమూ, మరొకవైపు సంకోచమూ ముప్పిరి గొనగా గబగబ నడుస్తూ దగ్గరికి వెళ్ళాను. నాచేతిలో ఒక కాగితం మడతపెట్టి "విప్పి చూడు" అంది. ఆత్రంగా విప్పిచూసాను. నాబొమ్మే. కుచ్చుల గౌనులో ఎంతో ముద్దుగా కనిపిస్తున్నాను. సిగ్గుగా మోహన వైపు చూసి నవ్వాను. "ఈసారి పుట్టిన రోజుకు అలాంటి ఫ్రాక్ కుట్టించుకో బాగుంటావు'' అంది చిరునవ్వుతో నావైపు చూస్తూ.

మరుచటి నెలలో నా పుట్టినరోజుకు అమ్మ దగ్గర పేచీ పెట్టి కుచ్చుల గౌను కుట్టించుకున్నాను. తలంటుకున్న జుత్తును రెండు పాయలుగా రిబ్బన్లతో కట్టించుకున్నాను. బొమ్మలో లావున్నానా లేదా అని పదే పదే అద్దంలో చూసుకున్నాను.

ఆరోజు అక్కయ్య స్కూలుకు రానని దూరంగా కూర్చుంది. అమ్మ నన్నుకూడా మానేయమంది. వెళ్తానని మొండికేస్తే మసాల్చీ ముసలయ్యను తోడిచ్చి పంపింది. దారిలో చెరువులో నుండి ఎఱ్ఱ కలువపూలు కోయించుకుని స్కూలుకు తీసుకెళ్ళాను. మోహన స్కూలు మానేయకుండా వుండాలని కోరుకుంటూ లోపలికి నడిచాను. నన్ను చూడగానే దగ్గరకు వచ్చింది మోహన'. నేనూ సిగ్గుగా నవ్వి తలదించుకున్నాను. "దొంగా! ఈరోజు నీ పుట్టిన రోజని చెప్పనేలేదు కదూ? చెప్తే నీకు బహుమతి తెచ్చేదాన్ని కదా?'' అంటూ బుగ్గలు పుణికింది. "అక్కయ్య రాలేదా?'' అనడిగింది.

"అక్కయ్య మడి రాకూడదు.'' అన్నాను. అంతటితో వూరుకోక "నువ్వు మడి కట్టుకోవా? ఎప్పుడూ స్కూలు మానేయవు?'' అనడిగా.

"అల్లరిపిల్లా! పెద్దమాటలు నీకెందుకు?'' అంది. ఆ మాటలు కోపంగా కాకుండా బుజ్జగించినట్టుగానే వున్నాయి. అక్కయ్య అయితే 'ముసలి మాటలూ నువ్వూ. ఫో అవతలికి' అని కసిరేది. అందుకే ఒద్దన్న పని చేయాలనిపించేది. కానీ మోహన అలా అన్నాక ఇంకోసారి అలామాట్లాడకూడదనుకున్నాను. కలువపూలు మోహన కందించాను.

''ఇవాళ మా ఇంటికి వస్తావా?'' వున్నట్టుండి అడిగింది మోహన కలువపూలను మెత్తగా చెంపకాన్చుకుంటూ.

"అమ్మో సాయంత్రం చీకటి పడిపోదూ?'' భయంగా చూసాను.

"ఇవాళ బుధవారం ఆఖరి పిరియడ్ నీకు గేమ్స్ కదూ? అప్పుడు వెళ్ళి బెల్లు కాకముందే వచ్చేద్దాం" అంది.

"మాకు గేమ్స్ క్లాసు వుందని నీకెలా తెల్సు?'' ఆశ్చర్యంగా అడిగాను.

"నువ్వు గ్రౌండులో ఆడుతుంటే మా క్లాసు కిటికీలో నుండి చూస్తాను" అనేసి నా చేయి ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది. నాకు చాలా సంతోషంగా అనిపించింది.

ఆఖరి పిరీయడ్‌లో ఇద్దరం మోహన వాళ్ళింటికి వెళ్ళాం.

నిజానికి ఆ ఇంటికి వాళ్ళాలని నాకెన్నాళ్ళుగానో కోరిక. ఊరికి కాస్త దూరంగా ఠీవిగా నిలబడ్డ ఆ మేడను చూపించి "ఎవరిదక్కా ఆ మేడ?" అని ఒకసారి అడిగాను కూడా.

అక్క అదోలానవ్వి "ఆ మేడ సంగతి నీకెందుకే?" అంది.

తరువాత మా క్లాసు పిల్లలు చెప్పేరు అది మోహన వాళ్ళ ఇల్లని.

మేము ఇంట్లోకి వెళ్ళేసరికి ఒక బుఱ్ఱమీసాల ఆయన ముఖమల్ దిండ్లను ఆనుకుని సోఫాలో కూర్చుని వున్నాడు. పక్కనే కూర్చున్న అందమైన ఆవిడ ఆయనకు తమలపాకు చిలకలు చుట్టి అందిస్తూంది.

మోహన ఆ బుఱ్ఱ మీసాలాయనను చూడగానే తలవంచుకుని, నా చేయిపట్టి గదిలోకి లాక్కుపోయింది.

"ఆయనెవరూ? మీ నాన్ననా? అయితే అంతభయమెందుకూ?" నా చేయి విడిపించుకుంటూ అడిగాను.

మోహన జవాబు చెప్పకుండా నేలవైపు చూస్తూ కూర్చుంది.

నాకు విసుగేసింది. "అయితే నేను వెళ్ళిపోతాను" అన్నాను. గభాలున నా చేయిపట్టి దగ్గరకు లాక్కుంది మోహన.

"కోపం వచ్చిందా? పుట్టిన రోజు నాడు స్వీటు తినకుండా వెళ్ళనిస్తానా?" అంటూ నన్ను కూర్చోబెట్టి పక్కగదిలోకి వెళ్ళి బిస్కట్లూ, ఆపిల్ ముక్కలూ, లడ్డూలు ప్లేటులో తెచ్చింది.

"ఎవరాపాప?" అంటూ లోపలికి వచ్చింది ఇందాక హాల్లో కూర్చున్న ఆమె.

"మా క్లాస్‌మేటు చెల్లెలు. ఇవాళ తన పుట్టినరోజు" అంది మోహన మెల్లిగా. ఇంకేదో అనబోయి సంకోచంగా హాల్లోకి తొంగిచూసింది.

"వెళ్ళిపోయార్లే..." అన్నదామె. తరువాత నా వైపు చూసి "నీ గౌను బాగుంది పాపా" అంది.

నేను మోహన వైపు చూసాను. మోహన నా వైపు చూసి నవ్వింది. నేనూ నవ్వాను.

"ఇద్దరూ నవ్వుకుంటున్నారు. ఏమిటో ఆ రహస్యం?" నా చేయి పట్టుకుంటూ అందామె.

ఆవిడ దగ్గర నుండి ఏదో మంచి పరిమళం తేలి వస్తూంది. ఆమె చేయి మెత్తగా ఎంతో బాగుంది. నాకు అమ్మ గుర్తొచ్చింది.

గబుక్కున లేచి నిలబడ్డాను. "ఇంక వెళ్ళిపోదాం" అన్నాను మోహనతో.

మోహన అల్మైరా తెరిచి ఒక బొమ్మ నా చేతిలో పెట్టింది. నల్లని చెక్క పలకమీద చెక్కి వెండిరేకు తొడుగు వేసిన సీతారాముల బొమ్మ అది. లక్ష్మణుడూ ఆంజనేయస్వామి కూడా వున్నారు. ఎంతో బాగుంది.

"నాకిచ్చా వెందుకూ?" అన్నాను చేతిలో ఆప్యాయంగా పట్టుకునే.

"నీకు పుట్టినరోజు కానుక. నా గుర్తుగా వుంచుకో. నాకు రాముడూ సీతా

చాలా ఇష్టం" అంది మోహన.

స్కూలుకు వచ్చేసరికి ముసలయ్య కాచుకుని వున్నాడు.

"ఎక్కడికి వెళ్ళారు చిన్నమ్మాయిగారూ? మీరు కనబడక గాభరా పడుతున్నాను" పుస్తకాల సంచీ అందుకుంటూ అన్నాడు.

అప్పుడు చూసాడు నా వెనుకనే వస్తున్న మోహననూ, నా చేతిలోని బొమ్మనూ.

..అయబాబోయ్ అయ్యగారు కోప్పడుతారు ఆ బొమ్మ ఇచ్చేసి రండి" అన్నాడు భయంగా.

''వుండనీ ఫరవాలేదు.'' అంది మోహన. ఆ గొంతు నాతో మాట్లాడుతున్నప్పటిలా మృదువుగా లేదు. ఆజ్ఞాపిస్తున్నట్టు గంభీరంగా వుంది.

మాట్లాడకుండా ముందుకు నడిచాడు ముసలయ్య.

ఆ బొమ్మ చూసి అక్కయ్య ఎగతాళిగా నవ్వింది. అమ్మ కోపగించలేదుగానీ "ఇంకోసారి అటు వెళ్ళకు. నాన్నగారు తిడతారు." అంది. ఆ రాత్రి అమ్మ పక్కన పడుకున్నప్పుడు అడిగాను 'అమ్మా! మోహన వాళ్ళు చెడ్డవాళ్లా?'' అని. "ఎవరన్నారలా?" అంది అమ్మ.

"ఆ అమ్మాయితో ఎవరూ మాట్లాడరు. వాళ్ళింటికి వెళ్ళకూడదంటారు. ఎందుకని?''

అమ్మ నిట్టూర్చింది. "చెడ్డవాళ్ళుకాదు పాపా దురదృష్టవంతులు." అంది.

ఆ తరువాత నెలరోజులకే మోహన హఠాత్తుగా స్కూలు మానేసింది. వాళ్ళమ్మ గుండెపోటుతో చనిపోయిందని మా క్లాసు పిల్లలు చెప్పుకున్నారు.

ఆ మాట విన్నప్పుడు నాకు చాలా ఏడుపొచ్చింది. పాపం మోహన ఏడుస్తోందేమో వెళ్ళి చూసి రావాలనిపించింది. అయితే వెళ్ళడానికి ధైర్యం లేకపోయింది.

పెద్ద పరీక్షలు కాగానే నాన్నగారికి బదిలీ అయింది.

* * *

మళ్ళీ మోహనను చూడలేదు. భద్రాచలం చేరేసరికి చీకటి పడింది. వియ్యాల వారికి ఘనంగా ఏర్పాట్లు చేసారు ఆడపెళ్ళివారు. విడిదింటికి మేళతాళాలతో తీసుకు వెళ్ళారు. ఊరంతా కొత్తగా వుంది. నేను చూచిన భద్రాచలంతో ఇప్పటి ఊరు పోల్చుకోవడం కష్టంగా వుంది.

దారిపొడుగునా మనుష్యులను పరీక్షగా చూస్తూ నడిచాను. 'ఒకవేళ వాల్మీకి కనబడినా గుర్తు పట్టగలనా?' అనుకుంటే నవ్వొచ్చింది. ఆమధ్యనెపుడో పేపర్లో వాల్మీకిని భద్రాచలం బదిలీ చేసినట్టు చూసాను. అతను నాకు తెలిసిన వాల్మీకి అయివుండవచ్చునేమో అని ఆశ.

వేడినీళ్ళ స్నానం చేసి, కాసేపు నడుము వాల్చిన తరువాత పెళ్ళికూతుర్ని చూడ్డానికి వెళ్ళాను. పెళ్ళి కూతురు ఇక్కడి స్కూల్లోనే చదివిందట. నేను భద్రాచలంలో

చదివేటప్పుడే వాల్మీకి పరిచయం అయ్యాడు.

నేను స్కూలు ఫైనల్లో వుండగా నాన్నగారికి భద్రాచలం ట్రాన్స్‌ఫర్ అయ్యింది. స్కూల్లో చేరేసరికి క్వార్టర్లీ పరీక్షలు పదిహేను రోజులున్నాయి. పుస్తకాలు దొరకలేదు. మాస్టార్లు వాళ్ళ పుస్తకాలు తాత్కాలికంగా వాడుకొమ్మని ఇచ్చారు. పరీక్షల ముందు నోట్స్ ఎవరిస్తారు? మాస్టార్ల నడగడానికి అభిమానం అడ్డొచ్చింది. ఆసారి పరీక్షల్లో అన్నిట్లోనూ బొటా బొటీ పాస్ మార్కులు వచ్చాయి. అన్ని సబ్జెక్ట్స్‌లోనూ ఫస్ట్ మార్కులు వాల్మీకి అనే కుబ్జవాడికి వచ్చాయి. నాకు ఉక్రోషం వచ్చింది "ఈసారి హాఫ్ ఇయర్లీలో ఎవరికి వస్తాయో ఫస్టు మార్కులు చూద్దాం" అతను వినేటట్టుగా సీతతో ఛాలెంజింగ్‌గా అన్నాను.

వాల్మీకి నావైపు చూసి చిరునవ్వు నవ్వేడు. అంతవరకు అతను నవ్వగాచూడలేదు నేను. ఎవరితోనూ మాట్లాడకుండా కూర్చునేవాడు. అతను నవ్వితే ఎంతో స్నేహంగా ఆత్మీయంగా అనిపించింది.

ఆ రోజు స్కూలు వదిలాక నేను వెళ్తుంటే తన నోట్స్ తెచ్చిచ్చాడు వాల్మీకి. "మీకు కావాలంటే కొన్ని రాసి పెట్టాను." అన్నాడు. ప్రొద్దున్న పరుషంగా మాట్లాడినందుకు సిగ్గనిపించింది. కృతజ్ఞతలు తెలిపి నోట్స్ తీసుకున్నాను. ఆ రాత్రి రాసుకుందామని నోట్సు తీస్తే అందులో నుండి ఒక కవరు జారిపడింది. ఆశ్చర్యంగా తీసి చూసాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అందులో మోహన ఫోటో వుంది.

మర్నాడు వాల్మీకి నడిగాను "మోహన మీకేమవుతుంది?" అని.

ఆశ్చర్యంగా చూసాడు "మా అక్కయ్య మీకెలాతెల్సు?" ఎదురు ప్రశ్నవేసాడు.

"అక్కయ్య పెళ్ళిచేసుకుందా? పిల్లలా?" అనడిగా వాల్మీకి ముఖం దించుకున్నాడు. "సారీ" అన్నాను.

వాల్మీకిని మోహన చదివిస్తోందట. మొదట్లో" ఎవరో బంధువుల ఇంట్లో వుంచార్ట. తరువాత హాస్టలుకు మారేట్ట. వాల్మీకిని తెలివైన విద్యార్థిగా గౌరవించేదాన్ని. అతను మోహన తమ్ముడని తెలిసాక ఆత్మీయత పెరిగింది.

అమ్మకు చెప్పాను వాల్మీకి గురించి. "పోనీలే పాపం... ఏదోరకంగా పైకిరానీ.." అంది. స్కూల్లో వాల్మీకి గురించి హేళనగా మాట్లాడేవాళ్ళు. చిన్నప్పుడు చెట్టుమీద నుండి పడ్డాడుట. రాయి తగిలి నుదుటి మీద లోతుగా గాటు పడింది. పెద్దింటి పిల్ల లెవరూ అతనితో కలిసేవారు కాదు. నాకు వాళ్ళమాటలు వింటే కోపమొచ్చేది. ఏమీ చేయలేక అమ్మతో చెప్పేదాన్ని.

అక్కయ్యకు పెళ్ళై వెళ్ళిపోయాక అమ్మకు నేనే స్నేహితురాల్ని. నాకు అమ్మ స్నేహితురాలు. అమ్మ ఓదార్చేది "ఎవరేమంటేనేమి? దేవుడు మేలుచేస్తే వీళ్ళందరికన్న అతడే పైకిరావొచ్చు" అనేది.

అమ్మకు దైవభక్తి ఎక్కువ. నడిచే ఓపిక లేకపోయినా గుడికి బయల్దేరేది. "ఇక్కడ వున్నన్నాళ్ళు ఆ రాముడిని చూసుకోనీవే" అనేది. అమ్మ అప్పుడు గర్భవతి. ఆపసోపాలు పడుతూ గుడి మెట్లెక్కేది. ఆలయం చేరడానికి రెండు వైపులా మెట్లుండేవి.

రోజూ ఒకవైపు మెట్లే ఎక్కేవాళ్ళం. ఒకరోజు "ఈరోజు అటునుండి ఎక్కుదాం" అన్నాను.

"వద్దులే అమ్మాయీ. భోగందాని మెట్లు ఎక్కి వెళ్ళకూడదు." అంది మాతోబాటు వచ్చిన పక్కింటి పిన్నిగారు. ఆ మెట్లు గురించి ఏదో కథకూడా చెప్పేరు. నాకు మోహన గుర్తొచ్చింది.

గుడికి వెళ్తే పవళింపు సేవకూడా అయ్యేదాక వుండి వచ్చే వాళ్ళం. ఉత్సవ మూర్తులకు వింజామర సేవచేసే భాగ్యం భక్తులకు లభించేది. నాచేత కూడా చేయించేది అమ్మ. ఒకరోజు నేను వింజామరసేవ చేయడం ముగించి వెనక్కి వస్తుండగా ముందుకు వస్తూ కనిపించేడు వాల్మీకి.

ముందున్న పెద్ద లెవరో అతన్ని వెనక్కి నెట్టేసారు "కులం గోత్రం లేనివాళ్ళంతా జంకుగొంకూ లేకుండా దేవుడి పూజకు ఎగబడుతుంటేనే కాలమిలా తగలడుతూంది" అంటూ దురుసుగా మాట్లాడేడు ఒక పెద్ద మనిషి.

నేను తలవంచుకుని వాల్మీకి వైపు చూడకుండా వెళ్ళి అమ్మ పక్కన కూర్చున్నాను.

చెల్లినీ తమ్ముడినీ నా సంరక్షణలో వదిలి అమ్మ పుట్టింటికి బయల్దేరింది.

గోదావరి దాటి వెళ్ళి అమ్మను బస్సెక్కించి వస్తుంటే వాల్మీకి ఎదురపడ్డాడు రేగిపోయిన జుత్తూ, ఎఱ్ఱని కళ్ళూ చూస్తే ఏడ్చి ఏడ్చి వచ్చినట్టు కనబడ్డాడు.

"ఏమయింది?" ఆదుర్దాగా అడిగాను.

'మోహనక్కకు ప్రమాదంగా వుందిట" అన్నాడు.

ఇంటికి వెళ్ళాక దిగులుగా వంటింట్లో కూర్చున్నాను. నాన్నగారొచ్చి తలనిమిరారు "అమ్మ కోసం అప్పుడే దిగులు పడుతున్నావా?" అన్నారు.

నాకళ్ళు నీళ్ళతో నిండిపోయేయి. "తలనొప్పిగా వుంది" అన్నాను.

అమృతాంజనం సీసా తెచ్చి నుదుటిమీద రాసేరు. కళ్ళ నీళ్ళు ధారగా కారి మనసు కాస్త శాంతించింది.

వాల్మీకి వచ్చాక తెలిసింది. మోహనను చేరదీసిన అతను యాక్సిడెంట్‌లో చనిపోయాడట. మోహన ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించిందట. అదృష్టం బాగుండి బ్రతికి బయట పడిందట. చెప్తుంటే వాల్మీకి కనులు వర్షించేయి. గుండె పట్టేసినట్టయింది నాకు. నాలుగురోజుల్లో వస్తున్న అమ్మకోసం ఎదురుచూసాను.

ఎఱ్ఱని మైసూరు క్రేపుచీర కట్టుకుని తెల్లగా ముద్దులొలికే చెల్లాయినెత్తుకుని అమ్మరాగానే మొట్టమొదటి కబురు మోహన గురించే చెప్పాను.

"బురదలో పుట్టినా పద్మం పవిత్రమైనదే" అంది అమ్మ.

పరీక్షల కోసం వాల్మీకి నేను పోటీ పడి చదివాము.

"మా అక్కయ్య కోసమైనా నేను పై చదువులు చదవాలి" అనేవాడు వాల్మీకి.

వాల్మీకికే స్కూలు ఫస్ట్ రావాలని కోరుకున్నాను నేను.

పరీక్షలయ్యాక వాల్మీకి వెళ్ళిపోయేడు. మేము భద్రాచలం నుండి కాకినాడ వెళ్ళాము.

మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత వచ్చాను. పెళ్ళి తతంగం ముగిసాక పెళ్ళికూతుర్నీ,

పెళ్ళికొడుకునీ తీసుకుని గుడికి బయల్దేరాం.

మెట్లెక్కి పైకి చేరేసరికి అటువైపు నుండి ఎవరో వి.ఐ.పి. కాబోలు మందీ మార్బలంతో వచ్చాడు.

వాళ్ళ దర్శనం అయ్యేదాకా మేము ఆగవలసి వచ్చింది.

వాళ్ళు బయటకు వస్తుంటే చూసాను. నుదుటిమీద గాయమూ చెవిమీది పుట్టుమచ్చా కొట్టొచ్చినట్టు కనబడ్డాయి. పక్కన పిల్ల చాడిని ఎత్తుకుని వస్తున్నది భార్య కాబోలు. వెనుకగా చేనేత చీరెలో వస్తున్న స్త్రీలో నాకు కావల్సిన పోలికల కోసం వెదుక్కుంటున్నాను.

"ఏం మనుషులో! దేవుడి దగ్గర కూడా అధికారం ధనమూ వున్నవాడికే జరుగుతుంది" అంటున్నారెవరో.

'ఎవరాయన?" అన్న మావారి ప్రశ్నకు "వాల్మీకి గారని..." అంటున్న పూజారి మాటలు నా సందేహాన్ని తీర్చాయి.

భద్రాచలం వచ్చినందుకు చాలా సంతోషంగా అనిపించింది.

వాల్మీకి చాలా మెట్లు ఎక్కేడు. అయితే ఏ మెట్లు ఎక్కి వచ్చాడో మరిచి పోలేదు.

పద పద అంటూ ముందుకు త్రోసేరు మావారు. వెనక్కి చూస్తున్నదాన్నల్లా తల తిప్పుకుని అడుగు ముందుకు వేసాను.

శబరి ఎంగిలి తిన్న సీతారాముడు ఎదురుగా దర్శనమిచ్చేడు. ●